క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసిన బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి జి.నరసింహామూర్తి మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుట కొరకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మండల సమాఖ్య కార్యాలయంలో ఆడిట్



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల సమాఖ్య కార్యాలయ నిర్వహణకు సంబంధించి 2022–23 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు బాజీ అండ్–కో చార్టెర్డ్ అకౌంట్స్ బృందం శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయ ఆవరణలో ఆడిట్ నిర్వహించింది. 40 మంది యానిమేటర్లు పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్టెడ్ అకౌంటెంట్ ఎం. సీతారామయ్య ఆధ్వర్యంలో బృందం రికార్డులు పరిశీలించింది. రేపల్లె క్లస్టర్ ఏరియా కో–ఆర్డినేటర్ రమాదేవి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు, యానిమేటర్లు, గ్రామ సమాఖ్య నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



కర్లపాలెం: ఏట్రవారిపాలెం గ్రామానికి చెందిన ధనలక్ష్మి అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు మృతురాలి కుమారుడు భాను ప్రకాష్‌కి శుక్రవారం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, వార్డు మెంబరు కృష్ణారెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పేరలి(కర్లపాలెం): పేరలి పంచాయతీ మల్లెల వారిపాలేనికి చెందిన కాగిత రాఘవులు(75)అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. అంత్యక్రియల ఖర్చులకు పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పేరలి బాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య రూ.5వేల నగదు అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి మద్దిబోయిన శివరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్రుముచ్చు మీరయ్య తదితరులు ఉన్నారు.

చినపరిమి సచివాలయం తనిఖీ



చుందూరు(భట్టిప్రోలు): చుందూరు మండలం చినపరిమి సచివాలయాన్ని మండల ప్రత్యేక అధికారిణి పి. జన్నమ్మ శుక్రవారం సందర్శించారు. సచివాలయ సిబ్బంది పని తీరును, రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. విద్యా కానుక కిట్ల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంయమనం పాటించాలి



కర్లపాలెం: రాగద్వేషాలకు గురి కావద్దని సంయమనం పాటించాలని బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. కర్లపాలెం పంచాయతీ రాజీవ్‌నగర్ గ్రామంలో గురువారం ఓ యువకుడిపై మరో వ్యక్తి హత్యాయత్నం చేయటంతో శుక్రవారం రాత్రి సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ శివయ్యతో కలసి గ్రామానికి వెళ్లి, ప్రజలతో మాట్లాడారు. అందరూ కలసి మెలసి ఉండాలని చెప్పారు. నేర చరిత్ర ఉన్న వారితో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.శివయ్య, సిబ్బంది ఉన్నారు.

చల్లగా.. ఒక్కసారిగా

- మధ్యాహ్నం వరకు మిటమిటలాడే ఎండ
- ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు
- సాయంత్రం ఈదురు గాలులు, వర్షం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తెగిన తీగలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం, పునరుద్ధరణకు తక్షణ చర్యలు



భట్టిప్రోలులో తెగిన విద్యుత్ స్తంభం వైర్లు

భట్టిప్రోలు/రేపల్లె రూరల్/ వేమూరు: ఒక్కసారిగా ఈదురు గాలులు, జోరు వర్షం కురవడంతో.. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు మిటమిటమంటూ ఎండ కాసింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో ఉరుములు, మెరుపులతో.. చిరు జల్లులుగా ప్రారంభమైన వర్షానికి ఈదురు గాలులు తోడయ్యాయి. భట్టిప్రోలులో 15 నిమిషాల పాటు వీచిన గాలులకు చెట్లు కూలి, విద్యుత్ తీగలపై పడటంతో..విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది విరిగిన చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ లైన్లు సరి చేసే పనిలో నిమగ్నమయ్యారు. రేపల్లె పట్టణంలో గాలివాన బీభత్సం సష్టించింది. పగటిపూట 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా.. సాయంత్రం 5 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంబడి చెట్లు, ఫ్లెక్సీలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరణకు ప్రత్యేక కృషి చేశారు. దాదాపు అరగంటసేపు కురిసిన వర్షంతో వాతావరణం కొంత మేర చల్లబడింది. వేమూరులో విపరీతంగా గాలులు వీయడంతో.. అర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లు రోడ్లపై పడి పోయాయి. రాక పోకలకు ఇబ్బందులు తప్పలేదు.



భట్టిప్రోలు మార్కెట్ రోడ్డులో కూలిన చెట్టు



రేపల్లె తహసీల్దారు కార్యాలయ ఆవరణలో విరిగిన చెట్టు



రేపల్లె 2వ వార్డులో విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది



రేపల్లె మోర్తోటలో విరిగిన విద్యుత్ స్తంభం



రేపల్లె బసవేశ్వర థియేటర్ సెంటరులో పడిపోయిన భారీ ఫ్లెక్సీ

సంగుపాలెంలో ఘనంగా విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

పాల్గొన్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



సంగుపాలెంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడు

పిట్టలవానిపాలెం: మండలంలోని సంగుపాలెం గ్రామం గణేష్ నామ స్మరణతో మారుమోగింది. శుక్రవారం ఉదయం 9:45 గంటలకు విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠను అత్యంత ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో విఘ్నేశ్వరుని పూజ, అగ్ని ప్రతిష్ట, యంత్ర పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గోమాత దేవాలయ ప్రవేశం నిర్వహించిన తర్వాత భక్తులు స్వామివారిని దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయన వెంట వైస్సార్ సీపీ నాయకులు నర్రా రమేష్, గ్రామ సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి తదితరులు ఉన్నారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం 3 వేల మందికి అన్న సంతర్పణ నిర్వహించారు.

మరో సచివాలయాన్ని ఏర్పాటు చేయాలి

ఎంపీ మోపిదేవికి లంకెవానిదిబ్బ గ్రామ ప్రజల వినతి



ఎంపీ మోపిదేవికి సమస్యను వివరిస్తున్న సర్పంచ్ పాపారావు, గ్రామస్తులు

రేపల్లె: లంకెవాని దిబ్బ గ్రామంలో అదనపు సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ చిలకలపూడి పాపారావు, గ్రామస్తులతో కలిసి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావును కోరారు. పట్టణంలోని ఎంపీ వ్యక్తిగత కార్యాలయంలో గ్రామస్తులు శుక్రవారం తమ సమస్యలను విన్నవించారు. అధిక జనాభా కారణంగా సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నట్లు తెలిపారు. మరో సచివాలయాన్ని ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలను పూర్తిస్థాయిలో అందించినవారవుతారన్నారు. అదేవిధంగా లంకెవాని దిబ్బ గ్రామంలో రహదారి నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీ మోపిదేవి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు రాయితీ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, ఏఓ

భట్టిప్రోలు: రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి తగు సలహాలు, సూచనలు అందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి కోరారు. శుక్రవారం భట్టిప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ముందస్తుగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య, మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుందేటి రమేష్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివయ్య

కర్లపాలెం: సరైన ధ్రువపత్రాలు పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం కర్లపాలెంలో ఆయన పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు, బండి పర్మిషన్ పత్రాలు వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించే డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సులు లేని వాహనదారులకు ఎస్ఐ శివయ్య ఫైన్ వేశారు.

నేటి నుంచి పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

బాపట్ల అర్బన్: బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని 20 సచివాలయాల్లో (34 వార్డులు) మూడు రోజులు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే కోన రఘుపతి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. 132.77 కి.మీ. పొడవు గల మురుగు కాలువల్లో చెత్తా, ఇతర వ్యర్థాలు, పూడిక తీసి, నీరు నిల్వ లేకుండా నిరంతర మురుగు పారుదల ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు ఈఓపీఆర్డీగా ఊహారాణి బాధ్యతల స్వీకారం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఈవోపీఆర్డీగా టి. ఊహారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె రేపల్లె ఈవోపీఆర్డీగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఈవోపీఆర్డీ బొప్పర శేఖర్ బదిలీపై వేమూరు వెళ్లారు. అలాగే పల్లెకోన పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన వీవీడీవీ ప్రసాద్ బాబు రేపల్లె మండలం కారుమూరు, పెదపులివర్రు పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన ఎస్ రాజశేఖరరెడ్డి చీరాల డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. పల్లెకోన, ఐలవరం జెడ్పీహైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులుగా ఈగ మునెయ్య, మోహన్‌రావులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈవో పులి లాజర్ తెలిపారు. వెల్లటూరు జెడ్పీహైస్కూల్ ప్రధనోపాధ్యాయులుగా కె. అరుణ కుమారి బాధ్యతలు చేపట్టగా ఇక్కడ పనిచేసిన కనపర్తి నిరీక్షణరావు అమృతలూరుకు బదిలీ అయ్యారు.

ఆధ్యాత్మిక చింతన ఉండాలి

రేపల్లె: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పెనుమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని శుక్రవారం ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్ఆర్‌సీపీ రూరల్ కన్వీనర్ గాదే వెంకయ్య బాబు, సర్పంచ్ దారం విజయ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల వార్షికోత్సవాలను రెండోవ రోజు శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టరు శ్రీనివాసరావు మాట్లాడారు. వ్యవసాయ విద్యార్థులు చక్కగా చదువుకోవటంతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానంచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి.. అందరికీ ఆదర్శం



ఎంపీ మోపిదేవికి సంక్షేమ లబ్ధిని వివరిస్తూ..సంతోషం వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముందుకెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రాష్ట్రాల పాలకులకు ఆదర్శంగా నిలుస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వార్డులోని ఎస్టీ కాలనీలో 220 గృహాలు పర్యటించారు. ఇంటింటికీ తిరిగి నాలుగేళ్ల కాలంలో లబ్ధిదారులు పొందిన ప్రభుత్వ పథకాల వివరాలను చదివి వినిపించారు. మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే మరిన్ని సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని వివరించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బవుడా దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్, మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త, మాజీ కౌన్సిలర్ చెన్ను లక్ష్మణరావు, నాయకులు ఐనాల సాంబశివరావు, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

కొల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందే లబ్ధిదారుల ఆధార్ అనుసంధానం చేయాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొల్లూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆధార్ అనుసంధానంపై సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆధార్‌ను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అనుసంధానం చేయాలని కోరారు. ఈ విషయంలో లబ్ధిదారుల తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఆధార్ నంబర్లు అనుసంధానించని వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం ఇకపై అందే అవకాశం ఉండదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. సమావేశంలో కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలి

ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్

రేపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం పథకాలపై చైతన్య పరచాలని ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు, అగ్రి అడ్వైజరీబోర్డు సభ్యులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాలకు ఇప్పటికే ఖరీఫ్‌కు సంబంధించిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోని రైతులుంటే వారిని గుర్తించి, చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏవో విజయ్‌బాబు, బోర్డు సభ్యులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతగా మారిన 'పెద కాపు'ల వివాదం

- పెదకాపు విషయంలో తలెత్తిన వివాదం
- కొత్తకాపు వర్గీయులపై దాడి చేసిన పాతకాపు వర్గీయులు
- ఐదుగురికి గాయాలు

బాపట్లటౌన్: తమ వార్డులో పెదకాపును నియమించుకునే విషయంలో తలెత్తిన వివాదం ఉప్పరపాలెంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఓ వర్గంపై మరో వర్గం ప్రజలు దాడి చేశారు. పట్టణ ఎస్ఐ షేక్ రఫీ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 6వ వార్డు ఉప్పరపాలెంలో గ్రామ పెద్ద కాపును నియమించేందుకు గ్రామస్తులు గురువారం రాత్రి సమావేశమయ్యారు. పెదకాపు విషయంలో వివాదం తలెత్తడంతో ఆట్ల నాగేశ్వరరెడ్డి వర్గీయులు ఉమాను పెదకాపుగా నియమించాలని ప్రతిపాదించారు. మాజీ పెదకాపు సూర్యనారాయణరెడ్డి వర్గీయులు రాజారెడ్డిని పెదకాపుగా నియమించాలని పట్టుపట్టారు. దీంతో వివాదం తలెత్తింది. దీంతో సూర్యనారాయణరెడ్డి వర్గీయులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఆట్ల బ్రహ్మారెడ్డి, శివారెడ్డి, దుర్గారెడ్డి, సీఎస్ దుర్గారెడ్డిపై దాడిచేశారు. ఈ దాడిలో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దాడిచేసిన మరుప్రోలు శంకర్‌రెడ్డి, పోతురాజురెడ్డి, సుబ్బారెడ్డి, బాలాజీరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డితోపాటు మరికొందరిపై పట్టణ ఎస్ఐ షేక్ రఫీ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మల తయారీపై ఆన్‌లైన్ బోధన

బాపట్ల అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానంపై అవగాహన కలిగించడంలో భాగంగా ఆన్‌లైన్‌లో విద్యార్థులకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని కేంద్రీయ విద్యాలయం ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సూర్యలంక ప్రిన్సిపల్ బోలిమెర నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. జన్ భాగీదరి కార్యక్రమంలో భాగంగా.. పాఠశాల సిబ్బంది నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ ద్వారా పప్పెట్స్ తయారీ విధానాన్ని విద్యార్థులకు బోధించారు. విద్యార్థులు ఆసక్తితో స్వయంగా తయారు చేశారు. వాటిపై కథలు చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు.

నేడు, రేపు గ్రూప్–2 సిలబస్‌పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ గ్రూప్–2 సిలబస్‌లో మార్పులపై రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జయం స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులో భారత్‌పేట ఒకటో లైనులోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 10 సబ్జెక్టుల్లో పది మంది అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జయం స్టడీ సర్కిల్ యాప్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 63094 93634 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.